క్లుప్తంగా

3 నుంచి సంగీత, సాహిత్య ఉత్సవాలు

విజయవాడకల్చరల్: సంగీత విద్వాంసులు వలివేటి వేంకట లక్ష్మీనరసింహం 78వ జయంతి సందర్భంగా ఈ నెల 3వ తేదీ నుంచి మూడు రోజుల పాటు దుర్గాపురంలోని సంగీత కళాశాలలో సంగీత, సాహిత్య నృత్య ఉత్సవాలు నిర్వహిస్తునట్లు నిర్వాహక సంఘ సభ్యులు వలివేటి శివరామకృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన భార్య కనిపించడం లేదంటూ భర్త కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బ్రహ్మం గారి మఠం ప్రాంతానికి చెందిన రాజ కొండ కృష్ణ(28), సాయి భార్యభర్తలు. కృష్ణ చేపల మార్కెట్ వద్ద పాత బట్టలు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటాడు. 25వ తేదీ సాయి తన స్నేహితురాలితో కలిసి బయటకు వెళ్లి వస్తానని చెప్పగా వద్దని భర్త వారించాడు. మరుసటి రోజు ఉదయం నిద్ర లేచే సరికి సాయి ఇంట్లో కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన భర్త కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతంలో కూడా సాయి ఇదే రీతిలో ఇంటి నుంచి వెళ్లి రెండు, మూడు రోజుల తర్వాత వచ్చేదని, అయితే ఇప్పుడు వారం రోజులు అవుతున్నా తన భార్య జాడలేదని భర్త పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వైభవంగా పట్టాభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయంలో శ్రీ రాముని పట్టాభిషేక మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పరాశరం పవన్ కుమార్ ఆచార్యుల పర్యవేక్షణలో పట్టాభిషేకాన్ని నిర్వహించగా, విన్నకోట శ్రీనివాసరావు శర్మ, ఖండపల్లి త్రినాథ ఆచార్యులు పర్యవేక్షించారు. చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు, ఈఓ రావూరి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

- **వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** పాతబస్తీ కొత్తగుళ్ల ప్రాంగణంలోని శ్రీ కోదండరామ స్వామి వారి దేవస్థానంలో స్వామి వారి పాదుకా పట్టాభిషేక మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులను కల్యాణవేదికపై అధిష్టింపజేశారు. అనంతరం స్వామి వారి పాదుకలకు వివిధ ద్రవ్యాలతో అభిషేకాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు పులిపాక రాఘవాచార్యులు చేపట్టారు. రాత్రి స్వామి వారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

రిటైర్డ్ హోంగార్డ్‌కు సాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ నగరంలో పని చేస్తున్న హోంగార్డుల్లో ఎవరైనా మరణించినా లేదా పదవీ విరమణ చేసినా వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా నగరంలో పని చేస్తున్న హోంగార్డులందరూ స్వచ్ఛందంగా వారికి వచ్చే వేతనం నుంచి ఆయా హోంగార్డులకు ఆర్థిక ఆసరా కల్పిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో హోంగార్డ్ కొండవీటి ఏసుబాబు విజయవాడ నగర హోంగార్డ్ యూనిట్‌లో విధులు నిర్వర్తిస్తూ గత నెల 22వ తేదీన పదవీ విరమణ చేశారు. దీంతో ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.5 లక్షల చెక్‌ను పోలీస్ కమిషనర్ టీకే రాణా అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో హోంగార్డ్ ఆర్ఐ కృష్ణ, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు బ్యాంక్ సెంటర్, సుధాకర్ మెడికల్ షాప్ రోడ్, గాంధీ బొమ్మ రోడ్, చర్చి రోడ్, కోళ్లఫారం రోడ్, డాల్ఫిన్ బార్ రోడ్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, జొన్నవిత్తులవారి వీధి, శంకర మఠం, పార్థసారథి వీధి, గురుకృప రోడ్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, టీవీ కృష్ణారావు వీధి, మానవ మందిరం రోడ్, గుప్తా సెంటర్ డౌన్, షాదీఖానా ఏరియా, అండిమాను బ్రహ్మయ్య వీధి, పోస్టాఫీస్ రోడ్, సిమెంట్ రోడ్ తదితర ప్రదేశాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని చెప్పారు.

పాత శివాలయంలో వసంత నవరాత్రులు ప్రారంభం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం)లో మల్లేశ్వరస్వామి వార్లకు వసంత నవరాత్రి సహిత కల్యాణ పుష్పయాగ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్వామి వారికి ప్రత్యేక పూజలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలను నిర్వహించారు. గణపతిపూజతో ఉత్సవానికి శ్రీకారం చుట్టారు. పుణ్యాహవచనం, దీక్షా స్వీకరణ తదితర వైదిక కార్యక్రమాలను పూర్తి చేశారు. ఆలయంలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలను నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు రాచకొండ సుమంతశర్మ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. అదే విధంగా కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి హేమలతాదేవి పర్యవేక్షించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు

- ఆసరా చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి
- సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా పశ్చిమ నియోజకవర్గంలోని 37, 52, 53 డివిజన్లకు చెందిన 280 స్వయం సహాయక సంఘాలకు 2 కోట్ల 87 లక్షల 22వేల 3 వందల 36 రూపాయలు విలువైన చెక్కును ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి లబ్ధిదారులు అందించారు. చేపలమార్కెట్ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం సెంటర్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

మహిళా పక్షపాతి వైఎస్ జగన్..

ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తున్నారన్నారు. మహిళల వికాసం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న చిత్తశుద్ధి కలిగిన సీఎం వైఎస్ జగన్ అన్నారు. గతంలో రుణమాఫీ పేరుతో మహిళలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. చంద్రబాబు నీచ రాజకీయాలను మహిళలు రానున్న రోజులలో తిప్పికొడతారన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు మహిళలకు ఏమి మంచి చేశారో లోకేష్ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన మహిళ పక్షపాతి జగన్ అని అన్నారు. కార్యక్రమానికి నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షత వహించారు.

కార్పొరేటర్లు మండేపూడి ఛటర్జీ, శీరంశెట్టి పూర్ణ, 52వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి తంగేళ్ల రామచంద్రరావు, శ్రీశైలం దేవస్థానం సభ్యుడు గురుమహంతు మహేష్, పార్టీ ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడు విశ్వనాథ రవి తదితరులు పాల్గొన్నారు.

రూ.63.54 కోట్లు అందజేత

పశ్చిమ నియోజకవర్గంలో 2,682 పొదుపు సంఘాలకు చెందిన 26,936 మంది మహిళలకు మొదటి విడతలో రూ.19.71 కోట్లు, రెండో విడతలో 27,809 మంది మహిళలకు రూ.23.19 కోట్లు అందించారు. తాజాగా మూడో విడతగా 27,352 మంది మహిళలకు రూ.20.63 కోట్లు జమకానున్నాయి. వైఎస్సార్ ఆసరా కింద మూడు విడతల్లో 82,097 మంది మహిళలకు రూ.63,54,73479 ప్రభుత్వం సాయం అందజేసింది.



మాకు ఆసరాగా ఉన్నారు..

మా పొదుపు సంఘాలకు పాత బకాయిలు తాలుకా ఇస్తున్న ఆర్థిక సాయం మా కుటుంబాలకు ఆసరాగా ఉంటుంది. అప్పట్లో అప్పులు మాఫీ చేస్తానని నాయకులు చేయలేదు. జగన్ అధికారంలోకి రాగానే మా అప్పులు తీర్చేందుకు సాయం చేస్తున్నారు. ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడింది.

– సునీతాదేవి, పొదుపు మహిళ, విజయవాడ



హామీ నిలబెట్టుకున్నారు..

ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీని సీఎం వైఎస్ జగన్ నిలబెట్టుకున్నారు. పొదుపు రుణాలు ఎన్నికల సమయానికి ఎంత ఉంటే అంత విడతల వారీగా ఇస్తానని చెప్పిన విధంగా ఆ హామీని నిలబెట్టుకున్నారు. మూడు దఫాలుగా ఇవ్వటం ఆనందంగా ఉంది.

– దుర్గ, పొదుపు మహిళ, విజయవాడ



చాలా సంతోషాన్ని కలిగించింది..

మా అప్పు ఎన్నికల సమయంలో ఎక్కువగా ఉంది. అలాగే మాకు మంచి లబ్ధి చేకూరింది. పొదుపు సంఘాల గురించి ఎవరూ పట్టించుకోరనే అభిప్రాయం ఉండేది. కానీ జగన్‌మోహన్‌రెడ్డి మాకు చెప్పినట్లుగా ఆర్థిక సాయాన్ని అందించటం చాలా సంతోషాన్ని కలిగించింది.

– కల్పనాదేవి, పొదుపు మహిళ, విజయవాడ

రికార్డు స్థాయిలో పన్నుల వసూళ్లు

- మార్చి 31న ఆస్తి పన్ను రూ.5.20 కోట్ల వసూలు
- పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకున్న వీఎంసీ



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ 2022–23 ఆర్థిక సంవత్సరం ముగింపు రోజైన శుక్రవారం రికార్డు స్థాయిలో పన్నుల వసూళ్లు చేసింది. దశాబ్ద కాలంలో లేని విధంగా పన్నులు వసూళ్లు చేసింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.177 కోట్లు ఆస్తిపన్ను డిమాండ్ ఉంటే అందులో రూ.138.55 కోట్లను వీఎంసీ రెవెన్యూ సిబ్బంది వసూళ్లు చేశారు. పన్నుల చెల్లింపులు చివరి గడువైన మార్చి 31వ తేదీన గతేడాది రూ. 3.58 కోట్లు వసూళ్లయితే ఈ ఏడాది రూ. 5.20 కోట్లు వసూళ్లయ్యాయి. గతేడాది రూ.93 కోట్లు మాత్రమే వసూల్లు చేస్తే ఈ ఏడాది రూ.138.55 కోట్లు వసూళ్లు చేశారు. నీటి పన్నుకు రూ. 64 కోట్లు డిమాండ్ ఉండగా గతేడాది రూ.28.33 కోట్లు వసూళ్లు చేస్తే ఈ ఏడాది రూ.36 కోట్లు వసూళ్లయ్యింది. ఖాళీ స్థలాలకు అధికంగా రూ.200 కోట్లు డిమాండ్ ఉండగా ఈ ఏడాది రూ. 34.25 కోట్లు వసూళ్లయ్యాయి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ(యూజీడీ) రూ.42 కోట్లు డిమాండ్ ఉండగా ఈ ఏడాది రూ.20.20 కోట్లు వసూళ్లయ్యాయి.

ప్రత్యేక జీఓ కారణంగా

ఆస్తి, ఖాళీస్థలాల పన్నులపై టీడీపీ ప్రభుత్వం వడ్డీ మాఫీకి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీర్ఘకాలికంగా పేరుకుపోయిన బకాయిదారుల నుంచి పన్నులు రాబట్టేందుకు మార్చి నెల 16వ తేదీన రాష్ట్ర మున్సిపల్ శాఖ జీఓ నంబర్ 34 తీసుకువచ్చింది.

దీంతో ఈ ఏడాది పన్నుల వసూళ్లలో వేగం పెరిగిందని, నగరంలోని దీర్ఘకాలికంగా ఉన్న నివేశ స్థలాలు, గృహ, వాణిజ్య పన్నులు వేగం పెరిగి అధిక రాబడి వచ్చిందని అధికారులు పేర్కొంటున్నారు.

విస్తృత ప్రచారం చేశాం

నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన పన్నుల వ్యవహారంలో వార్డు సచివాలయ వ్యవస్థను సమర్థంగా వినియోగించుకుని అధికంగా పన్నులు రాబట్టాం. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నంబర్ 34తో బకాయిదారులు పేరుకుపోయిన పన్నులను చెల్లింపులు చేశారు.

– డి.వెంకటలక్ష్మి, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ)

రూ.17 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): డివిజన్‌లోని కొండ ప్రాంతాల్లో రూ.17 లక్షలు వెచ్చించి దెబ్బతిన్న మెట్లు, డ్రెయిన్ల మరమ్మతులు చేపడుతున్నట్లు 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి పేర్కొన్నారు. 152వ సచివాలయం పరిధిలోని కొండ ప్రాంతల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ ఆదిలక్ష్మి శుక్రవారం పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. కొండ ప్రాంతాల్లో నివాసితులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నానని, అందులో భాగంగానే దెబ్బతిన్న మెట్లు, డ్రెయిన్లకు మరమ్మతులు నిర్వహిస్తున్నామన్నారు. డివిజన్ వాసులందరికీ రక్షిత మంచినీటిని అందించాలనే ధ్యేయంతో మంచినీటి పైపులైన్లను సైతం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, అయితా కిశోర్, గాలి గురుప్రసాద్, దుక్క దుర్గారావు, బాయన అమర్‌నాథ్, దుక్క హరి భాస్కర్, గాలి రామారావు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే మొదటి ర్యాంక్ సాధ్యం

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



ప్రశంసా పత్రంను అందజేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విజయవాడ నగరం మూడవ స్థానంలో ఉండటం మనకు గర్వకారణమని, దానిని అధిగమించి 2023లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవాలంటే మరింత ముందుకు వెళ్లాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. అందుకు నగర పాలక సంస్థ అధికారులతో పాటు ప్రజల సహకారం ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. నగరంలో ప్రతి ఇంటికీ మూడు (గ్రీన్, రెడ్, బ్లూ) చొప్పున బిన్స్ పంపిణీ చేశామని, ఏ రంగు బిన్‌ను దేనికి వాడాలో కూడా వివరించినా చాలా మంది ఒక బిన్ మాత్రమే వినియోగిస్తున్నారని తెలిపారు. ఇంటి నుంచి వెలువడే హానికర వ్యర్థాలను (శానిటరీ నాప్కిన్స్, డైపర్లు, సిరంజులు, కాలం చెల్లిన మందులు) పేపర్‌లో చుట్టి రెడ్ కలర్ బిన్‌లో వేసి పారిశుద్ధ కార్మికులకు అందచేయాలన్నారు. నగరపాలక సంస్థ స్వచ్ఛోత్సవ్ ముగింపు కార్యక్రమం శుక్రవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంట్లో వచ్చే చెత్తనుకూడా వేస్ట్ చేయవద్దని, అరటి పండు తొక్కలు, ఉపయోగించిన టీ పొడి వంటి వాటితో హోం కంపోస్ట్ తయారు చేసుకుని ఇంట్లో పెంచుకునే మొక్కలకు వినియోగించుకోవాలన్నారు. అలాగే బియ్యం కడిగిన నీరు, మినప పప్పు, కంది పప్పు కడిగిన నీటిని మొక్కల పాదులో పోస్తే చక్కగా ఎదుగుతాయని చెప్పారు.

జాతీయ స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించాలి

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ 64 డివిజన్లలో నూరు శాతం చెత్తను వేరు చేసి సేకరించడం, రోడ్లు, నివాస, వాణిజ్య, జనసమూహ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో గార్బేజ్ ఫ్రీ సిటీ సెవన్ స్టార్ సాధించగలమని తెలిపారు. జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించే దిశగా సమష్టి కృషి చేయాలన్నారు. నగరంలో 12 మంది ఉత్తమ పారిశుద్ధ్య మహిళా కార్మికులు, శానిటరీ సూపర్‌వైజర్లు, హోం కంపోస్ట్ చేస్తున్న ఆరుగురు మహిళలను గుర్తించి వారికి ప్రశంసా పత్రాలను అందచేశారు. చివరిగా 64 డివిజన్ల నుంచి 64 మంది మహిళలతో గార్బేజ్ ఫ్రీ సిటీపై అవగాహన కల్పించేలా స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, ఏసీజీ శ్యామల, సీఎంఓహెచ్ డాక్టర్ రత్నావళి పాల్గొన్నారు.

సామూహిక లలితా సహస్రనామ పారాయణం



పూజా సామగ్రితో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

విజయవాడకల్చరల్: లలితా సహస్రనామ పారాయణం భక్తి, ముక్తిదాయకమని తాడేపల్లి చైతన్యత పోవనం పీఠాధిపతి మాతా శివానంద సరస్వతి స్వామి అనుగ్రహ భాషణ చేశారు. జయహో భారతీయం, లింక్ ఫీల్స్, సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో ఉగాది వేడుకల సందర్భంగా మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో సామూహిక లలితా సహస్రనామ పారాయణం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. శివానంద సరస్వతి మాట్లాడుతూ జగన్మాత సరస్వశక్తి స్వరూపిణి అని శక్తిని ఆరాధించడం భారతీయ సంస్కృతిలో భాగమన్నారు. చిన్మయ మిషన్ అనంతపురానికి చెందిన యోగిని చంద్రకాళీ ప్రసాద మాతాజీ లలితా సహస్రనామ వైభవం అంశంగా ప్రసంగించారు. జయహో భారతీయం కార్యదర్శి శ్రీనివారెడ్డి అగస్త్య ఆధ్వర్యంలో రెండు వేల మంది మహిళలు ఐదు సార్లు లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఆధ్యాత్మికవేత్త యాబలూరి లోకనాథశర్మ, జయహో భారతీయం సభ్యులు మండవ శశిధర్, ఎం.వల్లీశ్వర్, వేణుమాధవ్ యలిగేటి పాల్గొన్నారు. మండలీక కృష్ణ ప్రసాద్ నిర్వహించారు.

కూచిపూడి సిద్దేంద్రయోగి కళాశాల అధ్యాపకుడు చింతారవి బాలకృష్ణ బృందం, నవదుర్గల వైభవం నృత్యాలను ప్రదర్శించారు. చిన్నారులు మనోజ్ఞ, శ్రీనృత్య చేసిన నృత్యం ఆకట్టుకుంది. ప్రత్యేక రక్షణదళం పోలీస్ కమాండెంట్ డాక్టర్ కేఎస్‌రావ్ దంపతులు అఖండ శంఖారావంతో కార్యక్రమాలకు శుభారంభం చేశారు. సిద్ధార్థ ఫార్మసీ కాలేజీ నుంచి సిద్ధార్థ కళాశాల వరకు శోభాయాత్ర నిర్వహించారు.

సంక్షేమ వసతిగృహాల్లో వసతుల అభివృద్ధికి చర్యలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



వసతి గృహంలోని విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రానున్న విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి జిల్లాలోని సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు తెలిపారు. భవానీపురం గాంధీ బొమ్మ రోడ్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆయన శుక్రవారం సాయంత్రం తనిఖీ చేసి విద్యార్థినుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో మౌలిక వసతులకు అవసరమైన ప్రతిపాదనలను అందజేయాలని సంక్షేమ అధికారులను ఆదేశించామన్నారు. భవానీపురంలోని బాలికల వసతి గృహాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వసతి గృహంలో 6 గదులు, డైనింగ్, రీడింగ్ హాల్స్ ఉన్నాయని, ప్రస్తుతం 30 మంది పాఠశాలల విద్యార్థినులు వసతి పొందుతున్నారని తెలిపారు. వసతి గృహ భవనంలో సీలింగ్ లీకేజి, సన్‌షేడ్ మరమ్మతులు, డ్రెయినేజి పైప్‌లైన్, ఫ్లోరింగ్, ప్రహరీ గోడల మరమ్మతులు చేపట్టాల్సి ఉందన్నారు. అలాగే తాగునీటి సౌకర్యం కోసం సింటెక్స్ వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఆయా మరమ్మతులు, పెయింటింగ్ పూర్తి చేసి పూర్తి స్థాయిలో అడ్మిషన్లు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సెప్టిక్ ట్యాంక్ పూడిక తీత పనులు చేపట్టాలని వీఎంసీ అధికారులను ఆదేశించారు. దాతల సహకారంతో విద్యుత్ పరికరాలు, దోమ తెరలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వసతి గృహ విద్యార్థినుల విద్యా ప్రమాణాలు సంతృప్తికరంగా ఉన్నాయని, మరింత మెరుగైన విద్యా బోధన అందించాలని సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి బీఎం విజయభారతి, వసతి గృహ సంక్షేమ అధికారి టి.ఆదిలక్ష్మి ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధికి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 48వ డివిజన్ బంగారయ్య కొట్టు బూస్టర్ సమీపంలో సీజీఎఫ్ నిధులు రూ.25 లక్షలు వెచ్చించి నూతనంగా నిర్మించిన శివనాగ మందిరంలో శ్రీ దుర్గా మల్లేశ్వర, విఘ్నేశ్వర, షణ్ముఖ, అయ్యప్ప స్వామి, ఆంజనేయ స్వామి, మహాలక్ష్మీ, షిర్డిసాయిలను ఎమ్మెల్యే వెలంపల్లి శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను ఆలయ పాలక వర్గం అధ్యక్షుడు బెవర రాము(గురుస్వామి), ప్రధాన కార్యదర్శి అయితా కృష్ణకిశోర్, కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి దంపతులతో పాటు ఇతర కమిటీ సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. కార్పొరేటర్ శీరంశెట్టి పూర్ణచంద్రరావు, డివిజన్ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, చిచ్చాలతో పాటు పలువురు పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీరామనవమి పండుగ సందర్భంగా విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోగల చెరువు సెంటర్ మర్రిచెట్టు వద్ద శుక్రవారం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ అన్నప్రసాద కార్యక్రమాన్ని 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు ప్రారంభించారు. కుండనాల అనిల్ వంశీ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు పాల్గొన్నారు.

కనులపండువగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో సీతాలక్ష్మణ ఆంజనేయ సమేతుడైన కల్యాణరాముని రథోత్సవం శుక్రవారం రాత్రి కనులపండువగా జరిగింది. కొత్తపేట కోమలవిలాస్ సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీనగరాల సీతారామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా సాయంత్రం రథోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తదితరులు కొబ్బరికాయలు కొట్టి ఉత్సవాన్ని ప్రారంభించారు. స్వామి వారి రథానికి వివిధ రకాల పూలతో, విద్యుత్ దీపాలతో నయనానందరంగా అలంకరణ చేశారు. అనంతరం సీతా, లక్ష్మణ సమేత శ్రీరామచంద్రస్వామి వారి ఉత్సవ మూర్తులను మేళతాళాలతో రథంపై అధిష్టింపజేశారు. రథోత్సవానికి తొలుత పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. విచిత్ర వేషధారణలు, భేతాళ నృత్యాలు భక్తులను విశేషంగా అలరించాయి. రథోత్సవం బ్రహ్మణవీధి ఆలయం నుంచి ప్రారంభమై నెహ్రూబొమ్మ సెంటర్, కేటీరోడ్డు, కోమలవిలాస్ సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా ముందుకు సాగి తిరిగి ఆలయానికి చేరుకుంది. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. విద్యుత్, పోలీస్ శాఖలు ప్రత్యేక బందోబస్తు చేపట్టాయి. వన్‌టౌన్‌లో సందడి వాతావరణం నెలకొంది. జనసేన పార్టీ నేత పోతిన మహేష్, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో జైలు శిక్ష

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంటిలో దొంగతనం చేసిన కేసులో నిందితుడికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. విజయవాడ కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అజిత్‌సింగ్‌నగర్ పైపుల రోడ్డులో అంబాపురానికి చెందిన మహిళ ఇంటిలో గతేడాది ఏప్రిల్ 13వ దొంగతనం జరిగింది. బాధితురాలి ఫిర్యాదుపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గతేడాది సెప్టెంబర్ 20వ తేదీన నిందితుడిని పీటీ వారెంట్‌పై తీసుకువచ్చి విచారించి అతని వద్ద నుంచి రూ.1,01,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణలో భాగంగా చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్ట్ ముందు ప్రాసిక్యూషన్ తరుపున 12 మంది సాక్షులను హాజరుపరిచారు. విచారణ అనంతరం నిందితుడైన దున్నా మనోజ్‌రావు(38)పై నేరం రుజువైనందున శుక్రవారం చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ డి.సత్యవతి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిషోర్, సీఎంఎస్ ఇన్‌స్పెక్టర్, సీసీఎస్ సీఐ ఎం రామ్‌కుమార్, కొత్తపేట ఎస్ఐ జి.రాజ నరేంద్ర, పటమట మహిళా ఎస్ఐ ఎం.వరలక్ష్మి, సీఎంఎస్ సిబ్బంది పర్యవేక్షణలో సాక్షులను కోర్టులో విచారించారు.

నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలి

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ శివగోపాల్‌మిశ్రా, దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ సీహెచ్ శంకరరావులు డిమాండ్ చేశారు. శుక్రవారం విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద జరిగిన నిరసన ర్యాలీలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివగోపాల్‌మిశ్రా మాట్లాడుతూ.. కార్మికులందరిలో చైతన్యం తెచ్చి నూతన పెన్షన్ విధానం రద్దు అయ్యేవరకు ఆలిండియా రైల్వే మేన్స్ ఫెడరేషన్ పోరాటం చేస్తోందన్నారు. శంకరరావు మాట్లాడుతూ ఉద్యోగుల పోరాటాలకు తలొగ్గి హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులందరికి పాత పెన్షన్ విధానం అమలులోకి తెచ్చిందని, పంజాబ్ ప్రభుత్వం కూడా పాత పెన్షన్ విధానం అమలు చేసే ప్రయత్నం ప్రారంభం చేసిందన్నారు. ర్యాలీలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ట్రెజరర్ మురళీధరన్, సహాయ కార్యదర్శులు ఉదయ భాస్కర్, వరప్రసాద్, సరోజినీరెడ్డి, విజయవాడ డివిజనల్ సెక్రటరీ శ్రీనివాసరావు, జోనల్ వైస్ ప్రెసిడెంట్ లీల, సికింద్రాబాద్ డివిజనల్ కార్యదర్శి రవీందర్, ఏపీ రాష్ట్ర ఎన్జీఓ సంఘ నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు బాబురావు, ఉమామహేశ్వరరావు, రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

బైక్ చోరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష

భవానీపురం(విజయవాడపశ్చిమ): ద్విచక్ర వాహనం దొంగతనం చేసిన కేసులో నిందితుడికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. గొల్లపూడి హెడ్ వాటర్ వర్క్స్ ప్రాంతానికి చెందిన ఎం.అర్జునరావు ద్విచక్ర వాహనం 2019 ఫిబ్రవరి 5వ తేదీ తన ఇంటి ముందు పార్క్ చేయగా చోరీకి గురైంది. అతని ఫిర్యాదుపై పోలీసులు అనుమానితులపై నిఘా ఏర్పాటు చేశారు. అదే ఏడాది ఫిబ్రవరి 20వ తేదీన ఇబ్రహీంపట్నం పోలీసులు బైక్ దొంగతనాల కేసులో అనుమానితుడైన కొండపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతానికి చెందిన నామాల నాగరాజు(32)ను అదుపులోకి తీసుకుని అతని నుంచి ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. నాగరాజుపై నేరం రుజువు కావడంతో శుక్రవారం చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ డి.సత్యవతి అతనికి 9 నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిషోర్, ఎస్ఐ వి.కృష్ణబాబు, టి.శ్రీనివాస్, సీఎంఎస్ సిబ్బంది పర్యవేక్షణలో సాక్షులను కోర్టులో విచారించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోశుక్రవారం పలువుర కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు అలరించింది. విజయవాడ యనమలకుదురుకు చెందిన శ్రీ హనుమాన్ నృత్య కళానిలయానికి చెందిన పుష్ప, లలితప్రియ, దీపిక, సహస్రలు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారికి పంచహారతుల అనంతరం కార్యక్రమాన్ని నిర్వహించారు. నృత్య ప్రదర్శన అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

పర్సనల్ బ్రాంచ్‌లో ఎస్ఆర్, లీవ్ సెల్ ప్రారంభం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్ పర్సనల్ బ్రాంచ్‌లో ఎస్ఆర్, లీవ్ సెల్‌ను విజయవాడ డీఆర్ఎం షివేంద్రమోహన్ ఏడీఆర్ఎం డి.శ్రీనివాసరావు, సీనియర్ డీపీఓ ఎం.బాలమురళీధర్‌లతో కలసి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ డీపీఓ బాల మురళీధర్ మాట్లాడుతూ ఉద్యోగులు పదవీ విరమణ సమయంలో ఫైనల్ సెటిల్‌మెంట్‌లు చేసేందుకు ఎస్ఆర్‌లు, లీవ్ చార్ట్‌లు ఎంతో ముఖ్యమైన రికార్డులు అన్నారు. అటువంటి రికార్డులు సురక్షితంగా అత్యంత భద్రత మధ్య ఉంచేందుకు ప్రత్యేకంగా కాంపాక్టర్‌లను ఏర్పాటు చేశామన్నారు.